సాక్షి
కుమురం భీం
మంగళవారం ♦ 25 ♦ జూన్ ♦ 2024



పొలాల్లో మృత్యుపాశాలు

పొలాల్లోని విద్యుత్ తీగలు అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రమాదకర తీగలతో రైతులతోపాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని వసతి గృహాల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రీమెట్రిక్ బాలుర వసతి గృహంలో 40 సీట్లు, పోస్టు మెట్రిక్ వసతి గృహంలో 86 సీట్లు ఉన్నాయన్నారు. 94411 70044 సంప్రదించాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
36.3 /28.4

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి సిద్దార్థ అన్నారు. డీఎంహెచ్‌వో తుకారాం భట్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహించాలన్నారు. ఆస్పత్రుల్లో అర్హత కలిగిన వైద్యులు, సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. డీఈ ఎంవో నాగలక్ష్మి, డీఈవో శివ తదితరులు ఉన్నారు.

వర్మీ కంపోస్టు వినియోగంతో అధిక దిగుబడి



సేంద్రియ ఎరువు విక్రయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కౌటాల(సిర్పూర్): వర్మీ కంపోస్టు వినియోగంతో అధిక దిగుబడి వస్తుందని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం వర్మీ కంపోస్టు విక్రయ మేళా ప్రారంభించారు. డీపీవో మాట్లాడుతూ చెత్తాచెదారంతో సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేసినట్లు తెలిపారు. రూ.100కు మూడు కిలోల వర్మీ కంపోస్టు బస్తా విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, జెడ్పీటీసీ అనూష, వైస్ ఎంపీపీ నికోడే అమ్మక్క, ఎంపీడీవో నస్రుల్లా ఖాన్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, ఎంపీటీసీలు శిరీష, మోతీరాం తదితరులు ఉన్నారు.

'అధికార పార్టీ కనుసన్నల్లోనే యంత్రాంగం'



మర్తిడిలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

బెజ్జూర్/కాగజ్‌నగర్‌రూరల్: అధికార పార్టీ కనుసన్నల్లోనే ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. అందవెల్లి వంతెనను సోమవారం సందర్శించారు. అలాగే బెజ్జూర్ మండలం సోమిని, తలాయి, అంబగట్ట గ్రామాల్లో రైతులను కలిశారు. మర్తిడిలో మాజీ ఎంపీటీసీ బుస సుశీల సారయ్య ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన హరీశ్‌బాబు దీక్షలు చేయటమేంటని, సీఎం కార్యాలయంలో లేదా ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తీసుకురావాలన్నారు. బెజ్జూర్ మండలంలో భూసమస్యలతో రైతులు కార్యాలయాలకు వెళ్తే అధికారులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని అన్నారు. సోమినికి చెందిన బాపు పదెకరాలను ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాడని, అతడి పట్టా భూమి ఇతరుల పేరుతో మార్పిడి జరగడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు ఆవుల రాజుకుమార్, యాదవ్, సారయ్య, సోయం చిన్నయ్య, కొండ రాంప్రసాద్, ఉమ, అంజన్న, శేఖర్, రంజిత్, లింగయ్య, నారాయణ, కిరణ్ పాల్గొన్నారు.



కుమురంభీం స్టడీ సర్కిల్‌లోని అభ్యర్థులతో బోధకులు

కోచింగ్ భేష్..!

- కుమురంభీం స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ
- పోటీ పరీక్షలు, ఎంట్రెన్స్ టెస్టుల్లో రాణించేలా బోధన
- సద్వినియోగం చేసుకుంటున్న గిరిజన అభ్యర్థులు
- ఇటీవల విడుదలైన టీజీపీఈ సెట్‌లో ర్యాంకులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రస్తుత కాలంలో పోటీ పరీక్షల కోచింగ్‌కు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. జిల్లాలో నాణ్యమైన కోచింగ్ లేకపోవడంతో అభ్యర్థులు ఎక్కువగా కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్తుంటారు. అక్కడ కూడా హాస్టళ్లు, అద్దె రూంల్లో ఉంటూ పడరాని పాట్లు పడేవారు. ఇలాంటి సమయంలో 2019లో జిల్లా కేంద్రంలో ఆదివాసీ పోరాట యోధుడు కుమురంభీం పేరు మీదుగా ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ గిరిజన అభ్యర్థులకు వరంగా మారింది. ఇక్కడ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ అనేక మంది ఎంట్రెన్స్ టెస్టులు, పోటీ పరీక్షల్లో సత్తా చాటుతున్నారు. ఇంటర్, డిగ్రీ, బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారికి ఇక్కడ ఉచిత శిక్షణ అందించడంతోపాటు ఉచిత వసతి కల్పించి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

మెరుగైన శిక్షణ

జిల్లాలో ఏర్పాటు చేసిన ఏకైక ఉచిత శిక్షణ కేంద్రం కుమురంభీం స్టడీ సర్కిల్. ఇక్కడ అభ్యర్థులకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఊషన్న, రాజశేఖర్‌ను డైరెక్టర్లుగా నియమించారు. వీరు ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నోటిఫికేషన్ల ఆధారంగా అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ శిక్షణ పొందిన వారిలో ఎనిమిది మంది పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. అలాగే మరో నలుగురు గురుకుల ఉపాధ్యాయులుగా, 18 మంది సీఆర్టీలు పని చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో 73 శాతంగా డీఈడీ, బీఈడీ అభ్యర్థులు టెట్‌లో ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఇటీవల విడుదల చేసిన వ్యాయమ విద్య కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీపీఈ సెట్)లో ఇక్కడ ఐదుగురు శిక్షణ పొందారు. వారందరూ అర్హత సాధించారు. అభ్యర్థులు రాష్ట్రస్థాయిలో 4, 7, 8 ర్యాంకులు సాధించి సత్తా చాటారు.

ఉన్నత స్థాయిలో నిలవాలి



ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ పరీక్షల తీరు మారుతోంది. దానికి అనుగుణంగా గిరిజన విద్యార్థులను ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తున్నాం. ప్రతీ విద్యార్థి జీవితంలో ఉన్నతస్థాయిలో నిలవాలనే ఉద్దేశంతో ప్రణాళికలు అమలు చేస్తున్నాం.

– ఊషన్న, స్టడీ సర్కిల్ డైరెక్టర్

శిక్షణ బాగుంది



స్టడీ సర్కిల్ నిర్వహణతోపాటు ఇక్కడ అందించే శిక్షణ బాగుంది. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. వ్యాయమ ఉపాధ్యాయుడు రాకేశ్ అందించిన శిక్షణ ఎంతో ఉపయోగ పడింది. వ్యాయమ విద్య కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించా.

– జంగుబాయి, తిమ్మాపూర్, మం.సిరికొండ

పేద విద్యార్థులకు వరం



జిల్లా కేంద్రంలోని కుమురంభీం స్టడీ సర్కిల్ నాలాంటి పేద విద్యార్థులకు వరంలా మారింది. స్టడీ సర్కిల్ రావడానికి ముందు నాకు పోటీ పరీక్షలపై ఎలాంటి అవగాహన లేదు. అయితే డైరెక్టర్లు వెన్నంటి ప్రోత్సహించారు. వారి శిక్షణలో రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించా.

– పెందోర్ రాజేశ్వరి, చిచ్పల్లి, మం.వాంకిడి

అంశాల వారీగా బోధన



అభ్యర్థులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు అంశాల వారీగా బోధించారు. గిరిజన విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారింది. ఇక్కడ శిక్షణ పొంది ఇటీవల గురుకులంలో టీజీటీగా ఉద్యోగం సాధించా.

– రాజమణి

బీఆర్ఎస్.. అలర్ట్

- పార్టీ ఎమ్మెల్యేలకు అధిష్టానం పిలుపు
- కోవ లక్ష్మి, అనిల్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు
- కేసీఆర్, కేటీఆర్‌తో భేటీ
- జగిత్యాల ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరిక నేపథ్యంలో..



అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే



కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

సాక్షి, ఆదిలాబాద్: బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయింది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ గుట్టుగా కాంగ్రెస్‌లో చేరడంతో వెంటనే అప్రమత్తమైంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలకు అధిష్టానం నుంచి పిలుపు అందింది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం చేరుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. సుమారు గంటన్నర నుంచి రెండు గంటల పాటు భేటీ జరిగినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎమ్మెల్యేలపై దృష్టి..

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా అధికార కాంగ్రెస్‌లోకి జారుకుంటున్న నేపథ్యంలో అధిష్టానం అప్రమత్తమై ఫోకస్ పెంచింది. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం గులాబీ పార్టీలో కలవరానికి దారి తీసింది. దీంతో మిగతా ఎమ్మెల్యేల విషయంలో పార్టీ సూక్ష్మంగా దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ నుంచి పిలుపు రావడంతో సోమవారం ఉమ్మడి జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో కేవలం ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోనే బీఆర్ఎస్ గెలుపొందింది. చెరో నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీలు గెలుపొందిన విషయం తెలిసిందే. కాగా గులాబీ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉండడంతో అధినేతల్లో కలవరం కనిపిస్తుంది. మిగతా ఎమ్మెల్యేలు చేజారకుండా చర్యలు చేపట్టడంలో భాగంగానే ఎర్రవల్లికి పిలిచినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను 'సాక్షి' సంప్రదించగా, సాధారణంగానే అధినేత కేసీఆర్, కేటీఆర్‌లను కలిసినట్లు వివరించారు.

కలెక్టరేట్ ఎదుట 'మధ్యాహ్న' కార్మికుల ధర్నా

- రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. రాజేందర్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు అల్పాహారం బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కోడిగుడ్ల కొనుగోలు కోసం కేటాయించే బడ్జెట్ సరిపోవడం లేదన్నారు. వంట గ్యాస్‌ను సబ్సిడీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎండీఎం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, కార్యదర్శి మాయ, నాయకులు కృష్ణమాచారి, వనిత, శ్యామల, బాయక్క, ప్రణీత, పార్వతి, శ్రీలత, సువర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల తర్వాత సిజేరియన్



సిజేరియన్ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

- జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి ఆపరేషన్ థియేటర్
- సోమవారం గర్భిణికి విజయవంతంగా కాన్పు

ఆసిఫాబాద్: దాదాపు మూడేళ్ల తర్వాత సోమవారం జిల్లా కేంద్రంలో వైద్యులు ఓ గర్భిణికి సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. జిల్లా ప్రజలకు కీలకమైన ప్రభుత్వ ఆస్పత్రి గర్భిణులకు కేవలం సాధారణ కాన్పులు చేయడానికి మాత్రమే పరిమితం కావడంతో సర్వత్రా విమర్శలు వచ్చాయి. జెడ్పీ సమావేశంలోనూ ఆస్పత్రి తీరు, వైద్యులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైద్యారోగ్య శాఖ మెరుగైన వైద్యం అందించడంపై దృష్టి సారించింది. నెల రోజులుగా ఆస్పత్రి భవనం మొదటి అంతస్తులో ఆపరేషన్ థియేటర్ సిద్ధం చేసే పనులు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఆసిఫాబాద్ మండలం అంకూసాపూర్ గ్రామానికి చెందిన గర్భిణి లొబాడి శోభ కాన్పు కోసం ఆస్పత్రిలో చేరింది. సాధారణ కాన్పుకు అనుకూలించకపోవడంతో సూపరింటెండెంట్ డాక్టర్ చెన్నకేశవులు, గైనకాలజిస్టు కవిత ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది విజయవంతంగా సిజేరియన్ ద్వారా పురుడు పోశారు. మగ శిశువు జన్మించగా.. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఆస్పత్రిలో రెండో సిజేరియన్..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని గత ప్రభుత్వం మెడికల్ కాలేజీకి అనుబంధం చేసి పడకలు పెంచి అప్‌గ్రేడ్ చేసింది. మూడేళ్ల క్రితం ఇక్కడ తొలిసారి సిజేరియన్ ద్వారా పురుడు పోశారు. ఆ తర్వాత ఆపరేషన్లు నిర్వహించకుండా కేవలం సాధారణ ప్రసవాలు మాత్రమే చేస్తున్నారు. దీంతో గర్భిణులు సిజేరియన్ల కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడ రూ.వేలు బిల్లులు వేస్తుండటంతో నిరుపేదలకు సిజేరియన్ కాన్పులు ఆర్థికంగా భారంగా మారాయి. ఎట్టకేలకు సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో రెండోసారి సిజేరియన్ నిర్వహించడం ద్వారా పేదలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ చెన్నకేశవ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ కొత్తగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక నుంచి అవసరమైన వారికి సిజేరియన్ చేస్తామని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ
- అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలు సమర్పించిన ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్‌కు చెందిన చునార్కర్ లలిత దరఖాస్తు చేసుకుంది. సబ్సిడీ నగదు మంజూరు చేయాలని రెబ్బెన మండలానికి చెందిన లింగంపల్లి ప్రశాంత్‌గౌడ్ కలెక్టర్‌కు విన్నవించాడు. తన భూమిని ఇతరులు అక్రమంగా పట్టా చేసుకున్నారని, విచారణ చేపట్టి అక్రమ పట్టా రద్దు చేయాలని సిర్పూర్(టి) మండలం డోర్పల్లికి చెందిన రాంటెంకి కమలనాథ్ అర్జీ సమర్పించాడు. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కెరమెరి మండలం ధనోరా గ్రామానికి చెందిన గాద విఠల్ దరఖాస్తు చేసుకున్నాడు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కల్పించాలని సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామానికి చెందిన డొర్కి హరీశ్‌కుమార్ అర్జీ సమర్పించాడు. ఆయా పోస్టు ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం వాడిగూడకు చెందిన కొడిమెత రాజ్యలక్ష్మి వేడుకుంది. ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టు కాలువల్లో ముంపునకు గురైన తన భూమికి పరిహారం ఇప్పించాలని బెజ్జూర్ మండలం పోతపల్లి గ్రామానికి చెందిన ఎనుక చిన్నయ్య కోరాడు. తన భూమి కొలతలు తీయించి హద్దులు గుర్తించాలని తిర్యాణి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన మడావి సూరు అర్జీ సమర్పించాడు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం


కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. 43 ప్రభుత్వ శాఖలు ఉండగా కేవలం ఐదారుగురు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం ప్రజావాణికి వచ్చిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే జిల్లా అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని అదనపు కలెక్టర్ దాసరి వేణును ఆదేశించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



తిర్యాణి మండలం గోవెనలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు మహేశ్వరి, ఇస్తారి, భీమవ్వ, ఎల్లయ్య తదితరులు ప్రజావాణిలో దరఖాస్తు అందించారు. గ్రామంలో విద్యుత్, రోడ్డు, తదితర వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.


పింఛన్ మంజూరు చేయాలి



నాలుగు నెలల క్రితం కింద పడటంతో కాలు విరిగింది. నడవడానికి ఇబ్బంది అవుతుంది. రోజువారి పనులకు కూడా కష్టమవుతుంది. ప్రభుత్వం నుంచి దివ్యాంగ సర్టిఫికెట్ ఇప్పించి పింఛన్ మంజూరు చేయాలి.

– కొండ లక్ష్మి, జన్కాపూర్, మం.ఆసిఫాబాద్

రైతుబంధు ఇప్పించాలి




నా భర్త సురేశ్ పేరుతో ప్రభుత్వం ధనోరా గ్రామంలో 2.96 ఎకరాల భూమి పట్టా ఇచ్చింది. రెండేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి రైతుబంధు నిలిచిపోయింది. వెంటనే రైతుబంధు పునరుద్ధరించాలి.


– అడె బీబాబాయి, ధనోరా, మం.కెరమెరి

'అందవెల్లి' వంతెనపై రాకపోకలు షురూ

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నిరవధిక నిరాహార దీక్ష
- సాయంత్రం వరకు అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి.. రాకపోకలు పునరుద్ధరణ



దీక్షలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు, నాయకులు



అందవెల్లి వంతెనపై వాహన రాకపోకలు


కాగజ్‌నగర్‌రూరల్/దహెగాం: కాగజ్‌నగర్, దహెగాం మధ్య పెద్దవాగుపై నిర్మించిన అందవెల్లి వంతెనపై ఎట్టకేలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం నాటికి అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికావడంతో ఎమ్మెల్యే హరీశ్‌బాబు వాహన రాకపోకలను ప్రారంభించారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడం, వంతెన ప్రారంభం కోసం నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వంతెన పునఃప్రారంభంలో జాప్యాన్ని నిరసిస్తూ కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వంతెన వద్ద సోమవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. దహెగాం, భీమిని మండలాల ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారని, బ్రిడ్జి పైనుంచి వాహనాలు వెళ్లే వరకు దీక్ష విరమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. కాగా.. సాయంత్రం వరకు అధికారులు మట్టితో వంతెన అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేశారు. ఎమ్మెల్యే స్వయంగా వాహనాల రాకపోకలను ప్రారంభించి, ఆటోలో నాయకులతో కలిసి ప్రయాణించారు. దీక్ష విరమించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేవలం 24 గంటల్లోనే వాహనాల రాకపోకలు పునరుద్ధరించడం ప్రజా విజయమని పేర్కొన్నారు. సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, ఆర్‌అండ్‌బీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వంతెన పైనుంచి సోమవారం ద్విచక్ర వాహనాలు, ఆటోలకు మాత్రమే అనుమతించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, వీరేంద్రచారి, బికాస్ ఘరామి, చన్కపురి గణపతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. సెకండియర్ ఫలితాల్లో జిల్లా నాలుగో స్థానంలో నిలవగా.. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 14వ స్థానంలో నిలిచింది. ఫస్టియర్ జనరల్ విభాగంలో 1,738 మంది విద్యార్థులకు 1,109 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 201 మందికి 128 మంది పాసయ్యారు. 63శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్ జనరల్ విభాగంలో 1028 మంది విద్యార్థులకు 699 మంది ఉత్తీర్ణులు కాగా.. ఒకేషనల్ విభాగంలో 120 మందికి 73 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 68 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈవో శంకర్ తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ అభినందించారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ విద్యార్థిని అదీబా తెహ్రీమ్ గతంలో 470 మార్కులకు 457 మార్కులు సాధించగా.. ప్రస్తుతం 466 మార్కులతో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. శ్రీహర్షితకు గతంలో 454 మార్కులు రాగా ప్రస్తుతం 461 మార్కులతో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు, బైపీసీలో విద్యకు గతంలో 440 మార్కులకు 398 మార్కులు రాగా.. ప్రస్తుత ఫలితాల్లో 430 మార్కులతో రాష్ట్రస్థాయిలో 9 ర్యాంకు సాధించారు. అలాగే ఎంపీసీలో సమత 470 మార్కులకు 456, బైపీసీలో శ్రావణి 440 మార్కులకు 425, సీఈసీలో సాత్విక 500 మార్కులకు 458, సాహిత్య 457 మార్కులు సాధించారు.



మోడల్ స్కూల్ విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా.. ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామ పరిధిలోని రాంపూర్‌కు చెందిన పెరుగు రాజేందర్ సోమవారం తన పంటచేనులో ట్రాక్టర్‌తో దున్నుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

భూ వివాదంలో ఐదుగురిపై కేసు

నెన్నెల: మండలంలోని నందులపల్లిలో గంట అజయ్ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన జంబి పోశం, జంబి లచ్చన్న, జంబి బానక్క, జంబి చుక్కల జంబి ప్రదీప్ సోమవారం దాడి చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గ్రామ శివారులో కోర్టులో కేసు నడుస్తున్న భూమిలో ట్రాక్టర్‌తో దున్నకూడదని గంట అజయ్ వాదించగా అతడిపై ఐదుగురు దూషిస్తూ దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కోటపల్లి: పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన పుప్పాల మల్లయ్య (65) కుమారుడు ఏడాది క్రితం, రెండునెలల క్రితం భార్య మృతి చెందారు. దీంతో మనస్తాపానికి గురైన మల్లయ్య సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారంలో సోమవారం పోలీసు, వ్యవసాయ శాఖ అధికా రులు సంయుక్తగా దాడులు నిర్వహించి 83 కి లోల లూజ్ పత్తి విత్తనాలు సీజ్ చేసినట్లు ఏవో మహేందర్, ఎస్సై రాజేందర్ తెలిపారు. త మకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన కోల కుమార్ ఇంట్లో తనిఖీలు నిర్వహి ంచగా 83 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించినట్లు తెలిపారు. నిందితుడిని పోలీస్ స్టేష న్‌కు తరలించి విచారించగా దోరప్పనేని శ్రీని వాస్‌రావు అనే వ్యక్తి నుంచి విత్తనాలు తెచ్చి నట్లు ఒప్పుకున్నాడు. దీంతో కుమార్‌తో పాటు శ్రీనివాస్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజుకుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్ సెల్, హిమోఫిలియా వ్యాధిగ్రస్తులందరికీ సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించినట్లు అందించినట్లు తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు, మానవ హక్కుల కమిషనర్‌ను కలిసి విన్నవించినా చర్యలు లేవన్నారు.

పొలాల్లో మృత్యుపాశాలు

పంట పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు రైతులను కలవరపెడుతున్నాయి. ఏటా రైతులతో పాటు మూగ జీవాలు సైతం పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కోటి ఆశలతో సాగు మొదలుపెడుతున్న అన్నదాతలను పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, కంచెలు లేని టాన్స్‌ఫార్మర్లు భయందోళనకు గురిచేస్తున్నాయి.



కన్నెపెల్లి మండలం కొత్తపల్లి శివారులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద విత్తనాలు వేస్తున్న కూలీలు

- ప్రమాదకరంగా వంగిన స్తంభాలు
- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- విద్యుదాఘాతంతో మూగజీవాల మృత్యువాత
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలతో రోజూ ఎక్కడో ఒకచోట మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నా రైతులు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యవసాయంలో రైతుకు వెన్నుదన్నుగా నిలిచే వేలాది రూపాయల విలువైన కాడెడ్లు, ఆవులు, గేదెలు, మేకలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందుతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో పంటచేలలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. స్తంభాలు ఒకవైపుకు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే మరమ్మతులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం చేనుకు వెళ్లాలంటే జంకుతున్నారు. కొన్ని గ్రామాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు గత్యంతరం లేక కర్రలను పాతి సపోర్ట్‌గా ఉంచుతున్నారు.



బెల్లంపల్లి మండలంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మూడు గేదెలు (ఫైల్)

ప్రమాదకరంగా వైర్లు

పంటచేలలో బోరుబావుల తవ్వకాలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు పెరిగాయి. ఇటీవల ప్రకృతి విలయాలు, తుపాన్ కారణంగా ఆ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

ఇటీవలి కొన్ని ఘటనలు

- ఈ నెల 20న భీమారం మండలం కొత్తగూడెం గ్రామ సమీపంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగలడంతో బూపల్లి లచ్చన్న, పల్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు పశువులు మృతి చెందాయి.
- ఈ నెల 18న బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ శివారులోని పంటచేలలో విద్యుత్ తీగలు తెగిపడడంతో అటుగా మేతకు వెళ్లిన మూడు గేదెలు వాటిని తాకడంతో మృతి చెందాయి.
- గత నెలలో దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి దున్నపోతు మృతి చెందింది.

సీజన్ ముందు పట్టింపేది?

ఏటా యాసంగి సీజన్ ముగిసి వానాకాలం సాగుకు ముందు మే నెలలో పంటచేలన్నీ బీడుభూములుగా ఉంటాయి. ఆ సమయంలో పొలాల్లో కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలను, వంగిన స్తంభాలను సరిచేయాల్సిన అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మేలో మరమ్మతుల పేర పదిరోజుల పాటు గ్రామాలు, పట్టణాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి కొన్నిచోట్ల మాత్రమే మరమ్మతులు చేపట్టారు. పంట పొలాలు, మైదాన ప్రాంతాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలను సరిచేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో గాలివాన బీభత్సానికి విద్యుత్ తీగలు తెగిపోవడంతో మేతకు వెళ్లిన మూగజీవాలు వాటిని తాకి మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

స్తంభాలు సరిచేయాలి

పంటచేలలో ఒకేవైపునకు వంగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని భయంగా ఉంది. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలు సరిచేయాలి. భయంతో విద్యుత్ తీగల కింద దుక్కులు దున్నలేకపోతున్నాం. వర్షాకాలం అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– సీహెచ్ బాపు, కొత్తపల్లి, కన్నెపెల్లి మండలం

ప్రమాదాల నివారణకు చర్యలు

పంటచేలలో వంగిన స్తంభాలు, లూజుగా ఉన్న విద్యుత్ తీగలు సరిచేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. కురుస్తున్న వర్షాలకు భూమి మెత్తబడి కొన్నిచోట్ల స్తంభాలు వంగిపోతున్నాయి. రైతులు ఫొటోలు తీసి పంపించడంతో వెంటనే సంబంధిత ఏఈలు వెళ్లి మరమ్మతులు చేపడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రావణ్‌కుమార్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఈ)

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: కార్మికులు గైర్హాజరు లేకుండా పనిచేయాలని ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని సమావేశం మందిరంలో గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతేడాది నిర్ణీత మస్టర్లు చేయని ఆర్కే, ఆర్కే న్యూటెక్ గని కార్మికులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం పురుషోత్తం రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, అధికారులు రాజేశ్, సంతస్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ చెల్లించాలని టవరెక్కిన కార్మికుడు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో పనిచేస్తున్న బి.మధు అనే కాంట్రాక్టు కార్మికుడు తనకు రావాల్సిన పీఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెగడపల్లి సమీపంలో సోమవారం టవరెక్కి హల్‌చల్ చేశాడు. ఎస్టీపీపీలోని పవర్‌మేక్ కంపెనీలో ఆరేళ్లుగా పని చేస్తున్నప్పటికీ పీఎఫ్ డబ్బులు చెల్లించడం లేదని, అధికారుల చుట్టూ తిరుగుతునప్పటికీ పట్టించుకోవడంలేదన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు పవర్‌మేక్ కంపెనీ అధికారులకు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడితో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తానని నచ్చజెప్పడంతో కిందకు దిగాడు. కాగా మధు ఇదే ఏడాది మార్చిలో కూడా పీఎఫ్ డబ్బులు చెల్లించాలని టవర్ ఎక్కి ఆందోళన చేపట్టాడు.

సింగరేణికే గనులు కేటాయించాలి

శ్రీరాంపూర్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని ఐఎన్టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ మనుగడ సాధించాలంటే తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికి అప్పగించాలన్నారు. బీజేపీ విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే 9 విడతలుగా బొగ్గు గనులను వేలం వేసి అమ్మేశారని, ఇప్పుడు 10వ విడతలో సింగరేణిలోని శ్రావణ్‌పల్లి గనిని కూడా వేలానికి వేయడం అభ్యంతరకరమన్నారు. దీనిపై ఐఎన్టీయూసీ పోరాడుతుందన్నారు. ఈ గనిని సింగరేణి కేటాయించాలని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారన్నారు. సమావేశంలో ఆ యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, సెంట్రల్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, నాయకులు తిరుపతి రాజు, లాగల శ్రీనివాస్ కొలిపాక సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌రావు

మందమర్రిరూరల్: రాష్ట్రంలోని నూతన బొగ్గు గనులను ఎలాంటి టెండర్ ప్రక్రియ లేకుండా సింగరేణికే కేటాయించాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గు గనులను దక్కించుకోవడానికి ఎలాంటి ఉద్యమాలకైనా సింగరేణి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు భూమయ్య, నాయకులు నరేందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీశాఖ అధికారుల సమీక్ష

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ఆదాయపన్నుపై ఐటీశాఖ అధికారులు సోమవారం సింగరేణి అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగులు ఆదాయ పన్ను రిటర్న్స్ కోసం సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. తప్పుడు పత్రాలు సమర్పిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారులు దేవేందర్ రెడ్డి, రాజేశ్వర్, పాలకుర్తి రాజు, కాంతారావు, సృజన్, గౌస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న అధికారులు

కాసిపేట-1 గనిని సందర్శించిన జీఎం



గనిపై అధికారులతో జీఎం మనోహర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట-1 గనిని సోమవారం ఏరియా జీఎం మనోహర్ సందర్శించారు. ఈ సందర్భంగా గని ప్లాన్‌లు, 3ఎస్ 10 స్టోరింగ్ ప్యానెల్, వివిధ పని స్థలాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. కేకే గ్రూపు ఏజెంట్ రామదాసు, గని మేనేజర్ భూశంకరయ్య, ఏరియా ఇంజనీర్ రాంప్రసాద్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో ఐదేళ్ల చిన్నారి మృతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కాలనీకి చెందిన ఇగురపు లోహిత (5) పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఇగురపు హరీశ్ కుమార్తె లోహితకు ఆదివారం రాత్రి వాంతులు కావడంతో పట్టణంలోని పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటి అనంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కాగజ్‌నగర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం వికటించడంతోనే మృతి చెందిందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని నచ్చజెప్పినా వినకపోవడంతో అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగింది. చివరకు నష్టపరిహారం చెల్లిస్తామని ఆస్పత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ యువకుడు ..

ఆసిఫాబాద్‌రూరల్: ఈ నెల 10న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన లోకండె మురళీకృష్ణ (22)ఈ నెల 10న ఇంట్లో పురుగుల మందు తాగడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

కుక్కను చంపిన వ్యక్తిపై కేసు

నస్పూర్: శునకాన్ని అత్యంత కిరాతకంగా కత్తితో పొడిచి చంపిన వ్యక్తిపై జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ గాయత్రి నగర్‌కు చెందిన పందుల పెంపకం యజమాని సమ్మయ్య తన పందులపై వీధి కుక్క దాడి చేసేందుకు యత్నిస్తుందని ఈ నెల 22న కత్తితో పొడిచి చంపాడన్నారు. ఈ విషయమై స్థానిక జంతు పరిరక్షణ కార్యకర్త గౌతం (ఎన్‌జీఓ) సోమవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దరోగపల్లిలో 'పోడు' వివాదం

- రైతును అదుపులోకి తీసుకునేందుకు అటవీ అధికారుల యత్నం
- అడ్డుకున్న కుటుంబ సభ్యులు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం దరోగపల్లి గ్రామంలో పోడు వివాదం తలెత్తింది. డంబిరె సుధాకర్ అనే రైతు గ్రామ సమీపంలోని పోడు భూమిలో పత్తి విత్తనాలు విత్తుకునేందుకు సోమవారం సాగు పనులు ప్రారంభించాడు. అటవీ భూముల్లోకి అక్రమంగా చొరబడి సాగు పనులు చేస్తున్నాడని సాయంత్రం ఫారెస్టు అధికారులు సుధాకర్ ఇంటికి చేరుకున్నారు. సుధాకర్‌ను అదుపులోకి తీసుకునే క్రమంలో కుటుంబ సభ్యులు పెంటయ్య, అంజక్క, శ్రీనివాస్, రేఖ.. బీట్ అధికారులు అరవింద్, వంశీ, సతీష్ మధ్య తోపులాట జరిగింది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో సాగును అడ్డుకోవడం ఏంటని కుటుంబ సభ్యులు ఎదురుతిరిగారు. సుమారు అరగంట వాగ్వాదం జరిగింది. మహిళలు అని చూడకుండా దాడి చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అటవీశాఖ అధికారులపై రైతు సుధాకర్ ఫిర్యాదు చేయగా.. విధులకు ఆటంకం కలిగిస్తూ అటవీ భూముల్లో సాగు పనులు చేపట్టాడని అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్సై కొమురయ్యను వివరణ కోరగా.. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



రైతును లాక్కెళ్తున్న అధికారులు, అడ్డుకుంటున్న కుటుంబ సభ్యులు

ఐటీడీఏ ఎదుట ఆదివాసీల ధర్నా



ఐటీడీఏ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో అనేక ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ఆదివాసీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావు మాట్లాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, షెడ్యూల్డ్ ప్రాంతంలో మెగా డీఎస్సీ ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జీవో 3ను యథావిధిగా కొనసాగించాలని, పోడుభూములు సాగుచేసుకుంటున్న ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, 1/70, పెసా, అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. 5 వ షెడ్యూల్డ్ ప్రాంతంలో జీవో 317 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వరాష్ట్రంలోనైనా ఆదివాసీలకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్న తమకు అన్ని విభాగాల్లో అసంతృప్తి ఎదురవుతుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాకు అందజేశారు. పీవో మాట్లాడుతూ ఐటీడీఏ మీదేనని, ఏ సమస్య ఉన్నా నేరుగా కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. తనతో సాధ్యమైన డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆదివాసీలు, సంఘాల నాయకులు శాంతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బుర్ర పోచ్చయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, నాయకులు తిరుపతి, కుమ్ర శ్యాంరావు, నగేశ్, జంగు, విజయ్, గోపీచంద్, రేణుక, పుష్పరాణి, తదితరులు పాల్గొన్నారు.

హైవేలో భూములు పోకుండా చూడాలి

మంచిర్యాలటౌన్: హైవేలో భూములు పోకుండా చూడాలని నేషనల్ హైవే 63 రహదారి బాధిత రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే పీడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే 63కు సంబంధించి అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, మూడు అలైన్‌మెంట్లు మార్చి, మూడవ అలైన్‌మెంట్‌గా నోటిఫికేషన్‌ను జారీ చేసి రైతులను ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 72 నోటిఫికేషన్ ద్వారా ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద భూములను కోల్పోయిన నిర్వాసితులైన రైతులు తిరిగి మరోసారి వారి భూములను కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. రెండుసార్లు భూములను కోల్పోవడం చట్టవిరుద్ధమని, తమ భూములను నేషనల్ హైవే అధికారులు తీసుకోవడాన్ని నేరంగా పరిగణించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కొందరు రాజకీయ దళారులతో చేతులు కలిపి బడా పెట్టుబడిదారుల కోసం, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూరేలా పాత అలైన్‌మెంట్‌ను మార్చారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తుల మధుసూదన్‌రావు, రైతులు లగిశెట్టి రాజమౌళి, జనార్దన్ రెడ్డి, పెట్టం తిరుపతి, తిప్పని మల్లేశ్, గొల్ల తిరుపతి, మంచిగట్ల మల్లేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు బోస్, బీసీ ఐక్యవేదిక నాయకులు గుమ్ముల శ్రీనివాస్, వడ్నాల శ్యాం, కొండల్ రెడ్డి, అల్లి పరమేశ్, అల్లి లక్ష్మీ, స్వచ్ఛంద పౌరసేవా సంస్థ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్గామ్ చౌరస్తా సమీపంలో ఆదివారం రాత్రి ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రశాంత్ పని నిమిత్తం ఆటోలో స్థానిక మంజులాపూర్ వెళ్లి వస్తుండగా ఈద్గామ్ చౌరస్తా సమీపంలో కారు ఢీకొట్టింది. ఆటో పూర్తిగా దెబ్బ తినడంతో పాటు ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్ తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టుపెట్టిన ఒకరి అరెస్ట్

భైంసాటౌన్: ఒక వర్గం మనోభావాలు దెబ్బతినేలా ఫొటో ఎడిట్ చేసి సామాజిక మాధ్యమంలో పోస్టుపెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ సోమవారం తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో స్టేటస్ పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

తండ్రిని కొట్టిన తనయుడికి జైలు

బెల్లంపల్లిరూరల్: మద్యం సేవించడానికి పెన్షన్ డబ్బులు ఇవ్వనందుకు తండ్రిపై దాడి చేసిన తనయుడికి కోర్టు ఆరునెలల జైలుశిక్ష విధించింది. కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గుమ్ముల శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 15న మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వాలని తండ్రి మల్లయ్యపై కర్రతో దాడి చేశాడు. మల్లయ్య తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సోమవారం నిందితుడిని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చగా జడ్జి ముఖేష్ సాక్షులను విచారించి ఆరు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై జి.నరేష్ తెలిపారు.

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని పట్టుకున్న రైల్వే పోలీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని సోమవారం జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. బెల్లంపల్లి మండలం మాల గురిజాల గ్రామానికి చెందిన కోనూరి స్వామి కొద్దిరోజులుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. కొంతకాలం హిజ్రాగా తిరిగిన స్వామి మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రైల్వేస్టేషన్ శివారులో తిరుగుతుండగా జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో 108లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఇంటికి తీసుకెళ్లారు.

ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో పనిచేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లో 102 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. ఇప్పటివరకు శ్రీరాంపూర్‌లో 3,424 మందికి కారుణ్య ఉద్యోగాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం పర్సనల్ రవీందర్‌రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు